పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి


రఘునాథపల్లి: ఎల్లారెడ్డిగూడెం పోలింగ్ కేంద్రంలో సిబ్బంది


లింగాలఘణపురం మండల కేంద్రంలో..


బచ్చన్నపేట: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

రఘునాథపల్లి: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో బుధవారం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం జరిగే శాసనసభ ఎన్నికల కోసం మండలంలోని 54 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. పోలీస్ బలగాలతో మండలంలో పటిష్ట బందోబస్తు చేపట్టాయి. మండలంలో ప్రశాంతగా ఎన్నికలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎస్సై చాగర్ల రఘుపతి కోరారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

జఫర్‌గఢ్: నేడు(గురువారం) నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 32,884 ఓటర్లకు గాను 41 పోలింగ్ కేంద్రాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఎన్నికల నిర్వహణకు ఒక్కో పోలింగ్ కేంద్రానికి 5 నుంచి 6 గురు చొప్పున మొత్తం 205 మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉదయాన్నే పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.


పాలకుర్తి టౌన్: సామగ్రితో వెళ్తున్న సిబ్బంది


చిల్పూరు: ముస్తాబైన పోలింగ్ కేంద్రం

దేవరుప్పులలో.

దేవరుప్పుల: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు బుధవారం ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. మండలంలో మొత్తం 40 బూత్‌లు ఉండగా 415 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు, పోలీసు కోరారు.

బచ్చన్నపేట: నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన 47 పోలింగ్ కేంద్రాలకు 282 మంది సిబ్బంది ఎన్నికల సామగ్రితో బుధవారం సాయంత్రం చేరుకున్నారని తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ రఘురామకృష్ణ తీసుకెళ్లి చూపించారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: మండలంలోని 38 పోలింగ్ కేంద్రాలకు 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల సామగ్రిని బుధవారం రాత్రి తీసుకొచ్చారు. 21 గ్రామాల్లో ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, పోలీసు బలగాలు సహితం తరలివచ్చారు. మండలంలో మొత్తం ఓటర్లు 32,021 అందులో పురుషులు 15,846, మహిళలు 16,175లు ఉన్నారు. వీరి కోసం 38 పోలింగ్ బూత్‌లలో పీఓలు, ఏపీఓలు, ఎస్‌పీఓలు సుమారు 160 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటుండగా శాంతిభద్రతల పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది, బలగాలు కూడా ఉన్నారు.

చిల్పూరు: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ రిటర్నింగ్ అధికారి వాసం రాంమూర్తి నియోజకవర్గంలోని 11 పోలింగ్ స్టేషన్‌లను ముస్తాబు చేయించారు. పోలింగ్ కేంద్రాల్లో మోడల్ పోలింగ్ , యూత్ పోలింగ్, పీడబ్ల్యూడీ పోలింగ్ స్టేషన్లుగా ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు వచ్చే వారికి ఈ పోలింగ్ కేంద్రాల్లో పండగ వాతావరణం తలపించే విధంగా ముస్తాబు చేయించినట్లు ఆయన తెలిపారు.

పాలకుర్తి టౌన్: సాధరణ ఎన్నికల్లో భాగంగా పాలకుర్తి నియోజవర్గ కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకు పాఠశాల నుండుట బుధవారం ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లతో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలలో 294 పోలింగ్ బూత్‌లు 36 సెక్టార్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పుటు చేసినట్లు ఆర్‌ఓ రోహిత్ సింగ్ తెలిపారు. ఏర్పట్లు జిల్లా ఎన్నికల అధికారి సిహెచ్ శివలింగయ్య సందిర్శంచి సూచనలు చేశారు.


జఫర్‌గఢ్‌లోని మోడల్ పోలింగ్ కేంద్రం


దేవరుప్పుల: పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది


బచ్చన్నపేటలోని పోలింగ్ కేంద్రం

క్లుప్తంగా

బ్లాక్ కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో తనిఖీలు



జఫర్‌గఢ్: వడ్డెగూడెంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య ఇంట్లో పోలీసులు బుధవారం పోలీసులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎల్లయ్య విలేకరులతో మాట్లాడుతూ కడియం శ్రీహరి ఓటమి భయంతోనే పోలీసులతో తన ఇంటిపై దాడులు చేయించారన్నారు. కాంగ్రెస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ఇలాంటి కుయక్తులు పన్నుతున్నారని అన్నారు.

వరికొయ్యలను కాల్చొద్దు



బచ్చన్నపేట: రైతులు వరి కోతలను కోసిన తర్వాత కొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయ అధికారి విధ్యానాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వరి పొలంలో పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు ఉంటాయని, అందులో మంట పెట్టడంతో అవి చనిపోతాయని తెలిపారు. ఈ సీజన్‌లో వర్షాలు అధికంగా పడడంతో వరి కోతలను పైకి కోసినందున ఆ కొయ్యలు కుళ్లడానికి సూపర్ ఫాస్పేట్ మందును చల్లాలన్నారు. దుక్కి దున్నే సమయంలో బీడు భూమిలో ఈ మందును చల్లితే బాగుంటుందని పేర్కొన్నారు. అలాగే వరి కొయ్యలను కాల్చే సమయంలో గాలులకు మంటలు పక్కకు వీచి గడ్డివాములు కూడా కాలిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితులల్లో వరి కొయ్యలను కాల్చకూడదని సూచించారు.

ఘన్‌పూర్‌లో ఎండు గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్టు, రిమాండ్


నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపాన ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, టాస్క్‌ఫోర్సు అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన దాడుల్లో 8 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జనగామ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రవీణ్, ఘన్‌పూర్ సీఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి డాక్టర్ క్రిష్ణప్రియ ఆదేశాల మేరకు ఘన్‌పూర్‌లో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్సు సంయుక్తంగా విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక రైల్వేస్టేషన్ సమీపాన తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో షేక్ అబ్దుల్లా (తానే, మహారాష్ట్ర), మెహఫోజ్(బీవండి, ముంబాయి) అనే ఇద్దరు నిందితులు అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా వైజాగ్ నుంచి ముంబైకి తరలిస్తున్నట్లు తెలిసిందని వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.4,070 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం జనగామ జైలుకు తరలించామన్నారు.

యజమాని మృతికి కన్నీళ్లు కార్చిన శునకం



కేసముద్రం: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతిచెందగా, అతడి మృతదేహం వద్ద పెంచుకుంటున్న శునకం దీనంగా తిరుగుతూ, కన్నీళ్లు కార్చి తన విశ్వాసాన్ని చాటుకున్న సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. కేసముద్రంస్టేషన్‌లోని సంతోష్‌నగర్‌కాలనీకి చెందిన బొంపల్లి చిన్ని(38)అనే వ్యక్తి కొంతకాలంగా శునకాన్ని పెంచుకుంటున్నాడు. అతడు ఎంతో ప్రేమగా పెంచుకునే శునకం అతడి వెంటే వెళ్లేది. ఈక్రమంలో అనారోగ్యానికి గురై యజమాని మృతిచెందాడు. దీంతో యజమాని మృతదేహం వద్ద శునకం తిరుగుతూ, కాళ్లపై పడుకుంటూ, ముఖం వద్దకు వెళ్లి తడుముతూ యజమానిపై తన ప్రేమను చూపింది. కుక్క విశ్వాసాన్ని చూసిన వారి హృదయాలు బరువెక్కాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నిత్యావసరాల అందజేత



జనగామ రూరల్: వాసవీ క్లబ్ గ్రేటర్ జనగామ అధ్యక్షుడు గట్టు వెంకటేశ్వర్లు జన్మదినం సందర్భంగా బుధవారం పట్టణంలోని వర్దన్ అనాథాశ్రమంలో రూ.4 వేల విలువ గల నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఆవోపా జిల్లా అధ్యక్షుడు ప్రమోదు కుమార్, పడకంటి రవీందర్, పులిగిల్ల సోమరాజు, జి.అనుజ. నాగమణి, వాసవి, వనిత తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కేయూ క్యాంపస్: ప్రజాస్వామిక వ్యవస్థలో ఓటు అనేది ఓ వజ్రాయుధం లాంటిదని, దాన్ని ప్రతీ ఓటరు వినియోగించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కు రాజ్యాంగబద్ధమైందని పేర్కొన్నారు. ఈక్రమంలో ఓటును సద్వినియోగం చేసుకుని రాజ్యాంగాన్ని పరిరక్షించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అందరూ ఓటు వేయాలని కోరారు.

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ దాడి

రాయపర్తి : మండలకేంద్రంలో బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు వర్ధన్నపేట ఎక్సైజ్ ఎస్సై సువర్ణ తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం బాటిళ్లను నిల్వ చేయగా సమాచారం మేరకు దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం విక్రయించినట్లెతే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా రైల్వేస్టేషన్

మహబూబాబాద్ రూరల్: సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో మహబూబాబాద్ రైల్వే స్టేషన్ బుధవారం ప్రయాణికులతో సందడిగా కనిపించింది. ప్రజలు తమ ఓటు హక్కును గురువారం వినియోగించుకునేందుకు వివిధ రైళ్ల ద్వారా మహబూబాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్, వరంగల్, విజయవాడ, ఖమ్మం, ఇతర ప్రాంతాల్లో ఉండే వారు ఇక్కడకు రాగా జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలు, తండాల్లో గల పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓట్లు వేస్తామని తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి


ఎన్‌సీసీ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

దేవరుప్పుల: విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగి అన్ని రంగాల్లో రాణిస్తూ.. దేశ సేవ చేయాలని బాలయేసు ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ అన్నారు. బుధవారం పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లు దేశ భక్తి, దేశ సరిహద్దులో జరిగిన యుద్ధాన్ని నాటిక రూపంలో ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జేసురాజ్ మాట్లాడుతూ.. దేశ సేవలో ఎన్‌సీసీ అనేక సేవలు అందిస్తుందని అన్నారు. బాధ్యతాయుత ప్రవర్తన నడవడికను అందిస్తూ. గొప్ప దేశ భక్తులుగా తీర్చి దిద్దుతుందని అన్నారు. నాటికలు ప్రదర్శించిన కేడెట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ మాస్టర్ క్రిష్ణ, ఖాజా, మాధవి, అనిత, విజయలక్ష్మి, మధన్‌మోహన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.


నాటిక ప్రదర్శిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

వలంటీర్లుగా సేవలందించనున్న విద్యార్థులు

చెన్నారావుపేట : నేడు(గురువారం) జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు సేవలందించేందుకు విద్యార్థులను వలంటీర్లను ఎన్నికల కమిషన్ కేటాయించింది. వృద్ధులకు, దివ్యాంగుల ఓటర్లకు తగిన సహాయం చేయడానికి వలంటీర్లను నియమించింది. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ నుంచి చెలకలపల్లి సిద్దార్థ, ప్రభాస్, నిక్సన్, మురళీకృష్ణలను వలంటీర్లుగా తీసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. వృద్ధులు, ఇతర అవసరాలు గల ఓటర్ల సహాయార్థం వలంటీర్లుగా పని చేయడం తమ జీవితంలో మర్చిపోలేమని అన్నారు.

జీడికల్ జాతరకు వేళాయె..

- రేపు వీరాచల రాముని కల్యాణం
- విద్యుత్ దీపాలతో ఆలయం అలంకరణ


విద్యుత్ దీపాల వెలుగులో జీడికల్ ఆలయం

లింగాలఘణపురం: త్రేతాయుగంలో స్వయంభువునిగా వెలసిన వీరాచల రామచంద్రస్వామి జీడికల్ ఆలయానికి రెండో భద్రాద్రిగా పేరుంది. కార్తీక మాసంలో ప్రారంభమైన జాతర.. నెల రోజుల పాటు జరుగుతుంది. ప్రతి ఏటా శ్రీరామ నవమితోపాటు, కార్తీకమాసంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడం విశేషం. జీడికల్ జాతరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ముఖ్యంగా మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తుంటారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో జీడికల్ వీరాచల రామచంద్రస్వామి పేరుతో 11 ఎకరాల భూమి ఉండడం జాతర ప్రాధాన్యతను తెలియజేస్తుంది. జీడికల్ గ్రామంలో ప్రతి ఇంటిలో ఒకరి పేరు రాములోరి పేరు పెట్టుకోవడం భక్తుల విశ్వాసానికి నిదర్శనం.

ఆలయ చరిత్ర..

త్రేతాయుగంలో వీరుడు, భద్రుడు ఇద్దరు మునీశ్వరుల తపోనిష్టతో భద్రాచలంలో భద్రాచల రామయ్య, జీడికల్‌లో వీరాచల రామచంద్రునిగా వెలసినట్లు ప్రతీతి. రాముడు వనవాసం చేసే సమయంలో పర్ణశాలలో ఉన్న సీతకు మాయలేడి కనిపించడంతో ఆ లేడి సంహారానికి బయలుదేరి జీడికల్ సమీపంలోని లేడిబండ వద్ద సంహరించినట్లు చెబుతారు. ఇప్పటికీ అక్కడ లేడి బండ ఉంది. అదేవిధంగా ఆలయంపైన జీడిగుండం, పాలగుండాల ఉంటాయి. అన్నా చెల్లెల్లు అని తెలియని ఇద్దరు స్వయం వరంలో వివాహం చేసుకోవడంతో ఒక్కసారిగా వీరి శరీరాలు నల్లబడిపోవడంతో 101 పుణ్యక్షేత్రాలను దర్శించుకొని జీడికల్‌లోని గుండాలలో స్నానం చేయగా పాప విమోచనం జరిగిందని, భక్తులు ఈ గుండాలలో స్నానాలు చేస్తే పాపాలు పోతాయని నమ్మకం.


ఆలయంలోని ఉత్సవ విగ్రహాలు

ముస్తాబైన ఆలయం

జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయం విద్యుత్ వెలుగులతో నిండిపోయింది. ఆలయం చుట్టూ రంగురంగుల లైట్లను వేసి సుందరంగా అలంకరించారు. నవంబర్ 26న ప్రారంభమైన జాతరలో డిసెంబర్ 1న సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణం, కల్యాణవేదిక వద్ద భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. సీఎస్ఆర్ నుంచి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసురెడ్డి ఆలయం ముందు గ్రానైట్ వేయించి సుందరంగా తీర్చిదిద్దారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

డిసెంబర్ 1న జరిగే జీడికల్ జాతరకు భక్తులకు తగిన విధంగా వసతులను కల్పించాం. కల్యాణ మండపంతోపాటు ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేయించాం. ప్రత్యేక వైద్య శిబిరం, తాగు నీటి వసతితో పాటు జనగామ నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తాం.

- శేషుభారతి, ఈఓ

వామ్మో వానరాల వీరంగం

- మూకుమ్మడిగా దాడులు చేస్తున్న కోతులు
- సరుకులు ఎత్తుకెళ్తున్న వైనం
- బెంబేలేత్తుతున్న ప్రజలు
- నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, పాలకులు


ఇబ్రహీంపూర్ వీధుల్లో స్వైర విహారం చేస్తున్న వానరాలు

రఘునాథపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు కోతుల బెడదతో బెంబేలెత్తుతున్నారు. వానరాల బెడదతో ప్రజలు బయటకు రావాలంటేనే బిక్కు బిక్కుమంటున్నారు. కోతులు వీరంగం సృష్టిస్తూ జనంపై దాడి చేస్తున్నా నియంత్రించాల్సిన అధికారులు ఆ దిశగా దృష్టిసారించడం లేదు. అడవుల నుంచి జనావాసాలకు వలస వస్తున్న వానరాలు ఏ వీదిలో చూసినా గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని శ్రీమన్నారయణపురం, ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్, భానాజీపేట, రఘునాథపల్లి, వెల్ది, నిడిగొండ, కోమళ్ల, ఎల్లారెడ్డిగూడెం, ఖిలాషాపూర్ గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. గుంపులుగా తిరుగుతూ మనుషులుపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే వివిధ గ్రామాల్లో వందలాది మందికి కరిచి గాయపర్చాయి. వీధుల్లో వెళ్తున్న మహిళలపై దాడులు చేస్తున్నాయి. అవి ఎప్పుడు ఎవరి మీద పడి దాడిస్తాయోనని నిత్యం గ్రామస్తులు భయం భయంగా గడుపుతున్నారు. కోతుల చేష్టలతో వేల రూపాయల వ్యయంతో పెంకుల కొనుగోలు మరమ్మతు చేసుకున్నా మళ్లీ బీభత్సం చేస్తుండటంతో ఏమీ చేయాలో పాలుపోక యజమానులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఇళ్లలోకి చొరబడి సామగ్రిని చిందర వందరగా చేయడంతో పాటు దొరికిన సరుకులను ఎత్తుకెళ్తున్నాయని ఆయా గ్రామాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో కవర్‌తో వెళ్లాలంటేనే హడలెత్తిపోతున్నారు. అంతేకాకుండా పంటలను నాశనం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతులు ఇళ్ల మధ్య సంచరిస్తుండగా అటు ప్రజా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. బోన్లలో బంధించి అటవీ ప్రాంతాలకు సురక్షితంగా తరలించటానికి ఇబ్బందులేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతులను నియంత్రించే చర్యలు చేపట్టి, తమ బాధలను తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం



నెక్కొండ : ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా నివారించడానికి సమష్టి కృషి చేయాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రేణుక అన్నారు. మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాలలో బుధవారం సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న నిర్వహించనున్న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపకూడదని అన్నారు. మందులేని ఎయిడ్స్‌కు నివారణే మార్గమని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి, డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, సంస్థ సభ్యులు లక్ష్మి, విజయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.